
ప్రజాశక్తి

శుక్రవారం 19 జులై 2024

5

పార్వతీపురం మన్యం



ఐదేళ్లయినా పూర్తికాని జెజెఎం పనులు

ప్రజాశక్తి-సీతంపేట

జల జీవన్ మిషన్ (జెజెఎం) పనులు ప్రారంభించి ఐదేళ్లయినా నియోజకవర్గంలో 40 శాతం కూడా పూర్తికాలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్‌డిఎ ప్రభుత్వం 2024 నాటికి మారుమూల గ్రామాలకు ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. కోట్లాది రూపాయలు కాంట్రాక్టర్ల పాలవుతుంటే ప్రభుత్వం ఫ్లెక్సీలు ప్రచారం తప్ప ఎందుకు పని పూర్తికావడం లేదో పరిశీలించడం లేదని ధ్వజమెత్తారు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో కాంట్రాక్టరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతంలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, జ్వరాల బారిన పడుతున్నారని చెప్పారు. కొత్త ప్రభుత్వం వెంటనే చొరవ చూపి పనులు త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా అభివృద్ధిలో

ప్రజల భాగస్వామ్యం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పారిశుధ్యం, విద్య, వైద్యం వంటి విషయాలలో మార్పులు తీసుకువచ్చి, జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించడానికి ప్రజల భాగస్వామ్యం, సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు చేపట్టే కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడిచినా బాల్యవివాహాలు జరగడం విచారకరమన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధికి చేపట్టనున్న పనుల గురించి వివరించారు. జిల్లాలో రవాణా సదుపాయాలు మెరుగు పరిచేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఏడాదిలో ప్రాధాన్యతా క్రమంలో రోడ్ల పనులన్నీ పూర్తిచేస్తామని వెల్లడించారు. జిల్లాలో రూ.414 కోట్లతో రహదారి పనులు మంజూరైనట్లు తెలిపారు. వన్‌ధన్ వికాస్ కేంద్రాలు మరింత చక్కగా పనిచేసేలా ప్రణాళిక రూపొందిస్తామని, కొత్తగా 10 కేంద్రాలు ఏర్పాటుకు ప్రతిపాదించామని వివరించారు. గిరిశిఖర గ్రామాలకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఫిల్టరేషన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నీటి వనరులు లేని చోట్ల ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందిస్తామని తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత కల్పిస్తూ మెడికల్ ఆఫీసరు స్థాయిలోనే ప్రజలకు పూర్తివైద్యం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చికిత్సకు అత్యవసరమైన రక్తం కొరత ఏర్పడకుండా ప్రతి నెలా రక్తసేకరణ శిబిరాలు ఏర్పాటుకు ప్రయత్నిస్తామని చెప్పారు. రెవెన్యూ, పోలీసు, ఉద్యోగులతో ప్రారంభించి నిరంతరం కొనసాగేలా కేలండర్ రూపొందిస్తామని వెల్లడించారు.

పాఠశాలల్లో విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఈ నెల 16 నుంచి ప్రారంభమైన పారిశుధ్య వారోత్సవాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. పరిసరాలను శుభ్రం చేసిన తరువాత ప్రజలు మళ్లీ చెత్తను వేయకుండా సహకరించాలని తెలిపారు. యాంటీ డయేరియా, యాంటీ లార్వా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. జిల్లాలో మలేరియా, డెంగీ కేసులు కొన్ని నమోదైనా, పరిస్థితి అదుపులో ఉందని, అన్ని నివారణ చర్యలు చేపడుతున్నామని వివరించారు. తాగునీటి వనరులు కలుషితం కాకుండా కాపాడుకోవాలని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన డిఎంహెచ్‌ఒ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయ పార్వతి గురువారం జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ఎక్కడా రోగాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పిహెచ్‌సిలను బలోపేతం చేసి, రోగులకు అక్కడే పరీక్షలు నిర్వహించి ప్రాథమిక స్థాయిలోనే వైద్యం అందించాలని ఆదేశించారు. దీనివల్ల జిల్లా కేంద్ర ఆస్పత్రిపై ఒత్తిడి తగ్గుతుందని సూచించారు.

వైసిపి హయాంలో ఐటిడిఎలు నిర్వీర్యం

గిరిజన సంక్షేమాన్ని గాలికొదిలేశారు : మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-సాలూరు

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వ హయాంలో ఐటిడిఎలను నిర్వీర్యం చేశారని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి విమర్శించారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐటిడిఎలో ఒక్క రూపాయి నిధి లేకుండా చేసిన ఘనత వైసిపిదేనని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని తొమ్మిది ఐటిడిఎల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని వైసిపి పాలకులపై విరుచుకుపడ్డారు. గత ఐదేళ్లలో గిరిజనుల సమస్యలు చెప్పుకోవడానికి గ్రీవెన్స్‌సెల్ కూడా నిర్వహించలేదని విమర్శించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఇద్దరు గిరిజన సంక్షేమ శాఖ మంత్రులు పని చేశారని చెప్పారు. నాలుగేళ్లలో ఒక్కసారి కూడా ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించలేదని ఎద్దేవాచేశారు. పది రోజుల్లో పార్వతీపురం ఐటిడిఎ పాలకవర్గ సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వైసిపి హయాంలో గిరిజన సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారని చెప్పారు. ట్రైకార్ రుణాలు కూడా మంజూరు కాలేదన్నారు. వైసిపి ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చడానికే రెండు సంవత్సరాల సమయం పట్టవచ్చని చెప్పారు. గిరిజన సంక్షేమ శాఖ పేరిట రూ.250 కోట్ల అప్పు ఉందని, మిగిలిన అన్ని శాఖల రుణాలు తేల్చే పనిలో ప్రభుత్వం ఉందని చెప్పారు.

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే వైసిపి నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలు చేపడుతున్నట్లు ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని దుయ్యబట్టారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజావేదిక కూల్చివేతతో మొదలైన విధ్వంసం ఎన్నో అరాచకాలకు నిలయంగా మారిందని చెప్పారు. ఏకలవ్య పాఠశాలల్లో ఉత్తరభారత దేశానికి చెందిన ఉపాధ్యాయులను నియమించడం వల్ల వారు హిందీలో బోధన చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారనే విషయంపై సిఎం చంద్రబాబు నాయుడు తో చర్చిస్తానని చెప్పారు.

31 గిరిజన గ్రామాలకు తాగునీటి పథకాలు

నియోజకవర్గ పరిధిలోని సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాలలో 31 గిరిజన గ్రామాలకు రూ.3 కోట్లతో తాగునీటి పథకాలు మంజూరు చేసినట్లు మంత్రి సంధ్యారాణి చెప్పారు. ఈ ప్రాంతంలో ప్రసిద్ధి గాంచిన పారమ్మకొండకు రహదారి నిర్మాణానికి రూ.1.8 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గిరిజన ప్రాంతాల్లో పర్యటించినప్పుడు తాగునీటి కొరత గురించి గిరిజనులు తన దృష్టికి తెచ్చారని గుర్తుచేశారు. సాగు, తాగునీరు సరఫరా చేయాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. సాగునీటి ప్రాజెక్టుల ఆధునీకరణ పనుల కోసం మంజూరైన జైకా నిధులను వైసిపి ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు. అందుకే ఆధునీకరణ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో మంజూరు కాలేదని చెప్పారు. ఈ సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, సీనియర్ నాయకులు పప్పల మోహన్, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, పాచిపెంట మండల సీనియర్ నాయకులు గూడెపు యుగంధర్ పాల్గొన్నారు.



మసీదులో ప్రార్థనలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి

మొహర్రం వేడుకల్లో మంత్రి

మొహర్రం వేడుకల్లో భాగంగా గురువారం పీర్ల పండుగ సందర్భంగా మంత్రి సంధ్యారాణి పట్టణంలోని మెట్టువీధి మసీదులో ప్రార్థనలు చేశారు. మసీదు పెద్దలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఆమె వెంట టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, ఇతర నాయకులు ఉన్నారు.

నేడు అరకు ఎంపి, జెడ్‌పి చైర్మన్ రాక

ప్రజాశక్తి-సాలూరు

అరకు ఎమ్‌పి తనూజా రాణి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శుక్రవారం నియోజకవర్గంలో పర్యటించను న్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసిపి ఓటమి నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలలో మనోధైర్యం నింపేందుకు వారు పర్యటిస్తున్నారు. మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం కానున్నారు. అనంతరం పాచిపెంట మండల పరిషత్తు సమావేశంలో పాల్గొంటారు.

హాజరు కానున్న మంత్రి సంధ్యారాణి

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కూడా శుక్రవారం నిర్వహించే పాచిపెంట మండల పరిషత్తు సమావేశంలో పాల్గొంటారు. వాస్తవానికి శుక్రవారం ఉదయం సాలూరు, మధ్యాహ్నం పాచిపెంట మండల పరిషత్తు సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ రెండు సమావేశాలకూ మంత్రి సంధ్యారాణి హాజరు కావాలని నిర్ణయించడంతో వైసిపి ఎమ్‌పి తనూజారాణి, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును రప్పించాలని రాజన్నదొర నిర్ణయం తీసుకున్నారు. సాలూరు మండల పరిషత్తు సమావేశాన్ని ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వాయిదా వేసినట్లు ఎంపిడిఒ ఫణీంద్ర కుమార్ చెప్పారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా అయితే రెండు చోట్లా సమావేశాలను వాయిదా వేయాల్సి ఉంది. సాలూరు మండల సమావేశాన్ని వాయిదా వేసి, పాచిపెంటలో నిర్వహించడం వెనుక ఆంతర్యం ఏమిటనేది అంతుచిక్కడం లేదు.

రాష్ట్రాన్ని రావణ కాష్టం చేయొద్దు

మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని రావణ కాష్టంలా మార్చొద్దని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర కోరారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే మహిళలు, బాలికలపై లైంగిక దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. నంద్యాల జిల్లాలో గిరిజన బాలికపై అత్యాచారం, హత్య జరిగినా ఇంతవరకు బాలిక మృతదేహం కూడా కనుగొనలేదన్నారు. విజయనగరం, అనకాపల్లి జిల్లాల్లో కూడా బాలికలపై లైంగిక దాడులు జరిగాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఇవే కాక వైసిపి నాయకులు, కార్యకర్తలపై దాడులు, హత్యాయత్నాలు కూడా పెచ్చుమీరుతున్న పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. మాజీ దళిత ఎమ్‌పి రెడ్డప్ప రెడ్డి, మరో ఎమ్‌పి మిధున్ రెడ్డిపై టిడిపి గూండాలు దాడి చేయడం అమానుషమని ఖండించారు. పల్నాడు జిల్లాలో వైసిపి కార్యకర్త రషీద్‌ని నడిరోడ్డుపై హత్య చేయడం రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దాడులు, హత్యలు జరుగుతున్న తీరు చూస్తుంటే రాష్ట్రంలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ముందు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో మహిళల అదృశ్యంపై ఆందోళన వ్యక్తం చేశారని గుర్తు చేశారు. గత రెండు నెలలుగా రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల గురించి డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నోరు విప్పాలని డిమాండ్ చేశారు.


పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలి

ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన వినతి

ప్రజాశక్తి-మక్కువ, పార్వతీపురంరూరల్

రైతులకు పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని ఎపి రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పార్వతీపురం, మక్కువ మండలాల్లో పలుచోట్ల గురువారం సచివాలయ కార్యదర్శులకు వినతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పెట్టుబడి సాయం రూ.20 వేలు ఇస్తామని ప్రకటించిందని, వ్యవసాయ పనులు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా ఇంత వరకు రైతుల ఖాతాల్లో వేయలేదని తెలిపారు. వెంటనే పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు మోటార్లు పెట్టేందుకు తెచ్చిన ప్రభుత్వ జిఒ 22ను రద్దు చేయాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు కొనసాగించాలని కోరారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలని కోరారు.

గత మూడేళ్లుగా జిల్లాలోని రైతులు కరువు, తుపాను నష్టాలకు గురయ్యారని, వారికి బకాయి పడ్డ పంటల బీమా పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.



తూరుమామిడి సచివాలయ కార్యదర్శికి వినతి అందిస్తున్న ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

వైసిపి నాయకుల కబ్జాలతో

కార్యాలయాలకు స్థలాలు కరువు

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

ప్రజాశక్తి-వీరఘట్టం

గత వైసిపి పాలకులు ఎక్కడికక్కడే భూకబ్జాలు చేయడంతో నేడు ప్రభుత్వ కార్యాలయాలు కట్టేందుకు స్థలాలు కరువయ్యాయని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆరోపించారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేపట్టి, గూండాగిరి పని పడతామని హెచ్చరించారు. గురువారం ఎమ్మెల్యే స్వగ్రామం ఎం.రాజపురంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. చెరువులు, గ్రామకంఠలు వంటివి కబ్జా చేశారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వి.కళావతి వండువ గ్రామంలోనే చెరువు కబ్జా చేశారని ఆరోపించారు. పేదల దగ్గర బలవంతంగా భూములు లాక్కొన్నారని తెలిపారు. భామిని, పాలకొండ, వీరఘట్టం మండలాల్లో అత్యధికంగా భూకబ్జాలు జరిగాయని, దీనిపై శ్వేత పత్రం విడుదల చేస్తామని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రహదారులు, తాగునీరు తదితర అంశాలపై ఎక్కువగా ప్రజల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ప్రతి బుధవారం పాలకొండలో జనవాహని గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పాలకొండకు ప్రత్యేకంగా నిధులు తెచ్చి అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉదయాన ఉదయ్ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, సిహెచ్ ఉమామహేశ్వరరావు, ఎ.కృష్ణ, టి.రమేష్, గర్భాన సత్తిబాబు, జనసేన జానీ, ఎం.పుండరీకం, పి.వెంకట రమణ, బి.హరిబాబు, కె.సాయి పవన్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జయకృష్ణకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైద్యాధికారులు

ఎమ్మెల్యేను కలిసిన వైద్యాధికారులు

ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను వీరఘట్టం, బిటివాడ పిహెచ్‌సిల వైద్యాధికారులు ఉమామహేశ్వరి, ప్రదీప్ కుమార్, మానస మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ధరల నియంత్రణకు చర్యలు



రాయితీపై కందిపప్పు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

ఎమ్మెల్యే జగదీశ్వరి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. మండలంలోని ఎల్విన్‌పేట గ్రామంలో సబ్సిడీపై కందిపప్పు అమ్మకాలను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఇష్టానుసారంగా నిత్యావసర ధరలను పెంచి ప్రజలపై మోయలేని భారం వేసిందన్నారు. దీంతో చాలా కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తంచేశారు. టిడిపి ప్రభుత్వంలో ప్రజలు కష్టాలు పడకూడదని గుర్తించి అన్ని వర్గాల ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కందిపప్పు కిలో ప్రస్తుత మార్కెట్లో రూ.181 ఉంటే రైతు బజార్లో, రిటైల్ దుకాణాల వద్ద రూ.160కే దొరుకుతుందన్నారు. సోనా మసూరి బియ్యం రైతు బజార్లో రూ.49, రెండో రకం రూ.48 ధర నిర్ణయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, తెలుగు మహిళా అరకు పార్లమెంట్ కార్యదర్శి కద్రక కళావతి, టిడిపి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దత్తి లక్ష్మణరావు, జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, సీనియర్ నాయకులు రొబ్బ లోవరాజు, జమ్మయ్య, తహశీల్దార్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికీ రహదారి సౌకర్యం

కురుపాం : ప్రతి గ్రామానికీ రహదారి సౌకర్యం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలో తోటపల్లి, గుణుపూర్ ప్రధాన రహదారి నుంచి సీతంపేట గ్రామానికి రూ.70 లక్షలతో, కొనగూడ గ్రామానికి రూ.1.20 కోట్లతో నిర్మించిన తారురోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామానికీ రహదారి, విద్య, వైద్య, మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పాలన కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఇఇ జె.శాంతి ఈశ్వరరావు, ఎంపిడిఒ ఎస్.అప్పారావు, ఎపిఒ బావాజీ, టిడిపి నాయకులు కోలా రంజిత్, కుమార్ డొంకాడ రామకృష్ణ, దత్తి లక్ష్మణరావు, చందక రామకృష్ణ, సుకేష్ చంద్ర పండ, వి. భారతి తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై కందిపప్పు, బియ్యం

సీతానగరం : కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటా నిలబెట్టుకునే దిశగా పాలన సాగుతుందని ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. సీతానగరం మండలంలో రాయితీపై కందిపప్పు, బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. అందులో భాగంగానే సబ్సిడీపై కందిపప్పు, బియ్యం సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

అంగన్వాడీ వివాదంపై ఆర్‌డిఒ విచారణ

ప్రజాశక్తి-సాలూరు

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో పని చేస్తున్న అంగన్వాడీ కార్యకర్త బి.రాధపై ఇతర అంగన్వాడీ కార్యకర్తలు చేసిన ఫిర్యాదు నేపథ్యంలో తలెత్తిన పరిణామాలపై గురువారం పార్వతీపురం ఆర్‌డిఒ హేమలత విచారణ చేపట్టారు. తహశీల్దార్ కార్యాలయంలో ఆమె రహస్య విచారణ నిర్వహించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న అంగన్వాడీ కార్యకర్త రాధ, ఫిర్యాదు చేసిన అంగన్వాడీ కార్యకర్తలు భారతి, విజయలక్ష్మిని విచారించారు. కొద్దిరోజుల క్రితం ఈ వివాదంపై ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్ రాణి వైటిసిలో విచారణ చేపట్టారు. విచారించిన తీరుపై అనుమానాలు వ్యక్తం కావడంతో ఇతర శాఖల అధికారులతో విచారణ జరిపించాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి కూడా ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో జరుగుతున్న పరిణామాలపై సీరియస్‌గా ఉన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరగాలని ఆదేశించడంతో ఆర్‌డిఒ హేమలతను విచారణ అధికారిగా నియమించారు.

22 నుంచి పాఠశాలల్లో 'శిక్షా సప్తాహ్'

ప్రజాశక్తి-బలిజిపేట

ఈ నెల 22 నుంచి మండలంలోని అన్ని పాఠశాలల్లో శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఎంఇఒ ఎస్.సింహాచలం తెలిపారు. జాతీయ నూతన విద్యా విధానం ప్రవేశపెట్టిన తర్వాత పరివర్తనాత్మక సంస్కరణలపై, దేశవ్యాప్తంగా విద్యాభివృద్ధి చేయడంలో నిబద్ధతను తెలియజేయడం ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. ఇందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు భాగస్వామ్యం కావాలని కోరారు.



దీక్షలకు మద్దతు తెలుపుతున్న సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు

శివ్వాం దళితులకు పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి-పార్వతీపురంటౌన్

భూ సమస్య పరిష్కారంతోపాటు పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని గరుగుబిల్లి మండలం శివ్వాం దళితులు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన చేపడుతున్న దీక్షలకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాలుగో రోజుకు చేరాయి. నాలుగో రోజు దీక్షల్లో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, పి.చిన్నయ్య, ఆర్.జ్యోతి, పాలక కళావతి, ఆర్.అప్పమ్మ, రేగిడి అప్పలస్వామి, గిరిజన సంఘం మండల కార్యదర్శి హిమరిక బలరాం కూర్చున్నారు. ఈ దీక్షలకు జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి కె.గౌరీశ్వరి, ఎం.శివాని, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, సంఘం నాయకులు కె.బృందావతి, రజిని, అప్పలనర్సమ్మ, హోజన తదితరులు మద్దతు ప్రకటించారు. దళితులు సాగు చేస్తున్న భూమి వారికి అప్పగించాలని, దాడి చేసిన పెత్తందారులను అరెస్టు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ రాక

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు కమిషన్ కార్యాలయ కార్యదర్శి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 11 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రభుత్వ శాఖల పాత్రపై నిర్వహించే సమీక్ష పాల్గొంటారని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వివిధ ప్రభుత్వ, గిరిజన సంక్షేమ వసతిగృహాలను, కార్పొరేట్, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను సందర్శిస్తారని వివరించారు.

ప్రాజెక్టు పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జల వనరుల ప్రాజెక్టుల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలోని తోటపల్లి, జంఝావతి, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ, ఒట్టిగెడ్డ తదితర జల వనరుల ప్రాజెక్టులపై కలెక్టర్ సమీక్షించారు. ప్రాజెక్టుల వారీగా ఆయకట్టు వివరాలు, కొనసాగుతున్న పనులును అధికారులు కలెక్టరుకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చక్కటి సాగు నీటిపారుదల వ్యవస్థను రూపొందించుటకు ఇంజనీర్లు నిబద్ధత, నిజాయతీతో పనిచేయాలని తెలిపారు. ప్రాజెక్టుల నిర్వహణలో మూడు జిల్లాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమన్వయం కొంతమేర కొరవడినట్లు కనిపిస్తుందని జిల్లా కలెక్టరు పేర్కొనగా, జల వనరుల శాఖలో కొత్త జిల్లాల వారీగా డివిజన్లు విడదీయలేదని అధికారులు తెలిపారు. పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు నోటీసులు జారీచేయాలని కలెక్టర్ సూచించారు. పెండింగులో ఉన్న భూ సేకరణ వివరాలను తెలియజేయాలన్నారు. ప్రాజెక్టులు, కాలువలు నిర్వహణకు కొత్త విధానాలు కనిపెట్టాలని, సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు చేసే ఇంజనీర్లకు రూ.లక్ష పారితోషికం అందించనున్నట్లు ప్రకటించారు. కాలువలలో పూడిక తీతకు అధిక ప్రాధాన్యమివ్వాలని, అవసరమైన యంత్రాలు, నిధులు సమకూరుస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ ఎస్ఇ రాజరాజేశ్వరి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



రోగులకు వైద్య సేవలు అందిస్తున్న ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఏరియా ఆస్పత్రికి రోజురోజుకూ రోగుల తాకిడి పెరుగుతోంది. ఇటీవల వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో దోమలు పెరగడం, జలాలు కలుషితం కావడంతో మలేరియా, వైరల్ జ్వరాలు చాప కింద నీరులా విజృంభిస్తున్నాయి. ఏరియా ఆస్పత్రిలో రోజుకు 300 వరకు ఒపి పెరిగింది. గతంలో 200 వరకు ఒపి ఉండేది. ఇప్పటికే ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు రోగులకు వైద్య సేవలు అందించడంలో అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. జ్వరాలకు మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్యులను ఇప్పటికే అప్రమత్తం చేశామని ఆయన తెలిపారు.

శివారు వీధుల్లో సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- పాలకొండ

పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని శివారు వీధుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం.. నగర పంచాయతీ అధికార యంత్రాంగాన్ని, పాలక పక్షాన్ని కోరింది. బుట్టిమఠం కాలనీలో సిపిఎం పాలకొండ నగర కార్యదర్శి దావాల రమణారావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకొండ పట్టణానికి ఆనుకొని ఉన్న గతంలో వేసిన డంపింగ్ యార్డులో వ్యర్థాలు, తడి చెత్త, పొడి చెత్త కలిసి ఉండడం వల్ల వర్షాలతో దుర్వాసన వస్తుందని, ఆ ప్రాంత ప్రజలందరూ అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డును తక్షణమే పట్టణానికి దూరంగా తరలించాలని కోరారు. కాలువలో మురుగు నీరు నిల్వ ఉండడం వల్ల వర్షాకాలంలో సీజనల్ వ్యాధులకు గురవుతున్నారని, తక్షణమే కాలువలను పరిశుభ్రపరిచాలని డిమాండ్ చేశారు. తక్షణమే మున్సిపాలిటీ అధికార యంత్రాంగం బుట్టిమఠం కాలనీలో పర్యటించాలని ,సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

152 మంది కౌలురైతుల గుర్తింపు

ప్రజాశక్తి-సీతంపేట



తహశీల్దార్ మహేశ్వరరావు

మండలంలో 152 మంది కౌలురైతులను గుర్తించామని తహశీల్దార్ ఎస్ఎ మహేశ్వరరావు తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కౌలురైతులకు గుర్తింపు కార్డులు అందిస్తామని, అందుకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరిచామని తెలిపారు. ఈ ధ్రువపత్రం బ్యాంకులకు తీసుకువెళ్తే రుణాలు ఇస్తారని తెలిపారు. కౌలురైతులకు గుర్తింపు కార్డుల వల్ల భూమి యజమానులకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవని స్పష్టం చేశారు. కౌలురైతుకు భూమిపై ఎటువంటి హక్కూ ఉండదన్ని ఎలిపారు. కేవలం పంటపైనే హక్కు ఉంటుందన్నారు..

సిహెచ్‌డబ్ల్యుల వేతన బకాయిలివ్వాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు బకాయి వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధానకార్యదర్శి వై.మన్మథరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటుచేసిన సిఐటియు సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ కాలంలో పోరాట ఫలితంగా ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని, వాటిని నెరవేర్చాలని కోరారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ కమ్యూనిటీ హెల్త్ వర్కర్ల ఐదు నెలల బకాయిలు వేతనాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. ఆశావర్కర్ల పనిభారం తగ్గించాలన్నారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరి, కార్యదర్శి ఎం.శివాని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె.బృందావతి, బి.అప్పల నరసమ్మ, రజిని, రంభ, సంజన, జ్యోతి పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన డిపిఒ

ప్రజాశక్తి - కురుపాం



విద్యార్థుల హ్యాండ్‌వాష్‌ను పరిశీలిస్తున్న డిపిఒ సత్యనారాయణ

కురుపాంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన మెనూ, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పారిశుధ్య వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల హ్యాండ్ వాష్‌ను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు విద్యా సామర్థ్యాన్ని పెంపొందించడానికి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎస్.అప్పారావు, ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఆర్.వేణుగోపాల్, ప్రధానోపాధ్యాయులు టి.శంకరరావు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి కెపివలస పాఠశాల పరిస్థితి

ప్రజాశక్తి-మక్కువ

కోదిపెద్దవలసలో ఉన్న పాఠశాల పరిస్థితిని మంత్రి గుమ్మడి సంధ్యారాణి దృష్టికి తీసుకువెళ్తామని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త గేదెల రిషివర్ధన్ తెలిపారు. గురువారం ఆ గ్రామంలో నిర్మాణంలో ఉన్న పాఠశాలను పరిశీలించారు. పనుల గురించి సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ సీతను అడిగి తెలుసుకున్నారు. నిధుల విడుదలపై మంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు వెంపడాపు సుగుణేశ్వరరావు, చప్పా రమేష్, బిసి సెల్ కోఆర్డినేటర్ బోను పాపారావు. తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై విమర్శలొస్తే
గ్రామస్థాయి సిబ్బందిపై చర్యలు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-బలిజిపేట

పారిశుధ్యంపై ఎక్కడైనా విమర్శలొస్తే గ్రామస్థాయి సిబ్బందిపై చర్యలు తప్పవని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని బర్లి గ్రామంలో గురువారం కలెక్టర్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య వారోత్సవాల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో సక్రమంగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడా పారిశుధ్యంపై విమర్శలు వినిపించకూడదన్నారు. ఏ గ్రామంలోనైనా పారిశుధ్యంపై విమర్శలు వినిపిస్తాయో, వ్యాధులు ప్రబలుతాయో ఆ గ్రామస్థాయి అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించాలని సూచించారు. బర్లిలో స్థానికంగా ఉన్న చెరువును అభివృద్ధి చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న వైద్య అధికారులు, సిబ్బంది గ్రామస్థాయిలో మలేరియా, డెంగీ, ఫైలేరియాపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి రవికుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి, సర్పంచ్ అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మిర్తివలసలో పారిశుధ్య వారోత్సవాలు

మండలంలోని మిర్తివలస గ్రామంలో ఎంపిడిఒ రమేష్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి తేజవతి ఆధ్వర్యాన పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించారు.

సీతంపేట : మర్రిపాడు, చిన్నబగ్గలో పారిశుధ్య వారోత్సవాలను కార్యదర్శి శ్యామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుధ్యం పై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు.

గుమ్మలక్ష్మీపురం : పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యానికి రక్షణ ఉంటుందని మండ సర్పంచ్ హైమావతి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్ అన్నారు. మండ గ్రామంలో పారిశుధ్య కార్యక్రమంపై గ్రామస్తులు, మహిళా సంఘాలు, విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎల్విన్‌పేట పంచాయతీ జెకెపాడులో సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి, పంచాయతీ కార్యదర్శి శ్యామల, కేదారిపురంలో కార్యదర్శి బిడ్డిక సురేష్, ఉపాధ్యాయులు అడ్డాకుల సన్యాసినాయుడు, తాడికొండలో సర్పంచ్ తాడంగి జగ్గారావు, కార్యదర్శి పాలక మల్లేష్, దుమ్మంగిలో సర్పంచ్ పాలక క్రాంతికుమార్, కార్యదర్శి నాగరాజు, జర్న గ్రామంలో కార్యదర్శి శెట్టి రామకృష్ణ, పి.ఆమిటిలో కార్యదర్శి రాజేష్ పారిశుధ్య వారోత్సవాలను నిర్వహించారు.



బలిజిపేట.. పారిశుధ్య పనులపై ఆరాతీస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

భామిని : మండలంలోని భామిని, బత్తిలిలో పారిశుధ్య నిర్వహణపై అవగాహన ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో భామిని ఎంపిటిసి బిడ్డికి విష్ణు, బత్తిలి సర్పంచ్ టింగ శాంతికుమారి, కార్యదర్శులు విశ్వేశ్వరరావు, శ్రీను, సచివాలయ సిబ్బంది ఆదినారాయణ, ప్రమోద్, చందన, గంగాధర్ ఉన్నారు.

సీతానగరం : మండలంలోని లక్ష్మీపురం, కాశీపేట, రంగంపేట గ్రామాల్లో పారిశుధ్య వారోత్సవాలు నిర్వహించారు. ఎంఇఒ జి.వెంకటరావు, టిడిపి నాయకులు టి.వెంకటనాయుడు, తేలు చంద్రశేఖర్, తేలు తిరుపతిరావు, చప్ప విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు మురళీకృష్ణ, కామేశ్వరరావు, వెంకటనాయుడు, వైద్య సిబ్బంది బి.రమాదేవి కె.కీర్తి పాల్గొన్నారు.

సొంత డబ్బులతో పారిశుధ్య పనులు

పాలకొండ : పాలకొండ నగర పంచాయతీ పరిధిలో సెగిడి వీధి నుంచి గారమ్మ కాలనీకి వెళ్లే మార్గంలో గత ప్రభుత్వ హయాంలో మొదలైన బ్రిడ్జి పనులను సగంలో వదిలేశారు. దానివల్ల గారమ్మకాలనీ వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే వర్షపు నీరుతోపాటు పాత బ్రిడ్జి వ్యర్థాల చెత్త కూడా ఇళ్లల్లోకి వెళ్లిపోవడం వల్ల చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దానివల్ల రోగాలతో సహవాసం చేస్తున్నారని తెలుసుకున్న జనసేన, టిడిపి నాయకులు, సెగిడి వీధికి చెందిన టిడిపి యువ నాయకులు భోగాది వెంకటరమణ, పొట్నూరు సంతోష్ కుమార్, లొట్టి అనిల్ తదితరులు స్వయంగా వాళ్ల బాధలు చూసి చలించిపోయారు. సొంత డబ్బుతో బ్రిడ్జి దగ్గర వ్యర్థాలను తొలగించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తమ బాధలు తీరుస్తారని గారమ్మ కాలనీ వాసులు కోరుతున్నారు.



గుమ్మలక్ష్మీపురం.. మండ అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అడుగు పెట్టలేం.. బండి నడపలేం

ప్రజాశక్తి-వీరఘట్టం



పాఠశాలకు వెళ్లే మార్గంలో రహదారిపై నిలిచిన మురుగు నీరు

మండల కేంద్రంలోని తెలగ - గాసి వీధుల మధ్య రహదారి మురుగునీటి నిండిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రహదారికి ఇరువైపులా కాలువలు లేకపోవడంతో పైనుంచే వచ్చే మురుగు నీరంతా రహదారిపై నిలిచిపోతోంది. దీంతో ఇటు పాదచారులు, అటు వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. ఇదే రహదారిలో ఎంపిపి పాఠశాల ఉంది. విద్యార్థులు ఇదే రహదారి మీదుగా పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి. దీంతో మురుగునీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎమ్మెల్యే విజయ్‌చంద్ర గురువారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు మంచి స్పందన లభించింది. పలు ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలు విన్నవించుకున్నారు. రోడ్లు కావాలని, లో వోల్టేజీ సమస్య ఉందని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ పలువురు ఎమ్మెల్యేకు వినతులు అందించారు. ప్రతి వినతినీ ఎమ్మెల్యే క్షుణ్ణంగా చదివి ఫిర్యాదుదారులతో మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. తక్షణమే పరిష్కరించగలిగే సమస్యలపై ఆయా అధికారులతో మాట్లాడి, పరిష్కరించాలని ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

సీతానగరం : సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే బి.విజయ్ చంద్ర ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో గురువారం సమీక్షించారు. తొలుత ఎంపిడిఒ ఈశ్వరరావు, ఇఒపిఆర్‌డి కెకె వర్మ ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం అధికారులతో ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎఒ ఎస్.అవినీష్, ఎంఇఒ సూరిదేముడు, తదితరులు పాల్గొన్నారు.



కోతకు గురైన రోడ్డు వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

రోడ్డు వేయాలని నిరసన

ప్రజాశక్తి-పాచిపెంట

మండలంలోని కొండమోసూరు జంక్షన్ నుంచి అల్లంపాడు, కొండలుద్దండి మీదుగా మెలియా కంచూరు వరకు రోడ్డు వెంటనే వేయాలని ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో గురువారం మూలపాడు గెడ్డ వద్ద నిరసన చేపట్టారు. మూలపాడు గెడ్డ వద్ద మినీ కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని సిపిఎం జిల్లా నాయకులు కోరాడ ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మూలపాడు గెడ్డ వద్ద రోడ్డు కొట్టుకుపోయినా అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని నిలదీశారు. మంత్రి సంధ్యారాణి స్పందించి, ఇటువంటి గిరిజన గ్రామాల రహదారులను బాగుచేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు డప్పు శ్రీనివాసరావు, కోటపర్తి సింహాచలం, జన్ని శంకర్రావు, సిపిఎం నాయకులు కొర్ర శ్రీనివాసరావు పాల్గొన్నారు.





పార్వతీపురం, కురుపాంలో హెల్మెట్‌పై అవగాహన ర్యాలీ చేపడుతున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది, విద్యార్థులు

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ వాడాలని రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యాన హెల్మెట్ వినియోగంపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేని డ్రైవింగ్ చాలా ప్రమాదకరమని, అందరూ తప్పకుండా వినియోగించాలని కోరారు. అసౌకర్యం పేరుతో, ఇతర కారణాలతో హెల్మెట్ వాడకపోవటం సరికాదన్నారు. కారులో ప్రయాణించే వారంతా సీటు బెల్టులు తప్పక ధరించాలని, బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంటు ఎన్.శ్రీనివాసరావు మాట్లాడుతూ అతివేగం, నిర్లక్ష్యం కారణంగా ఎదుటివారిని ప్రమాదంలోకి నెట్టొద్దని విజ్ఞప్తిచేశారు. విద్యార్థులు, యువత జాగ్రత్తగా ఉండాలని, ఓవర్ స్పీడ్‌తో వాహనాలను నడపరాదని కోరారు. ఎస్ఐ బి.రవీంద్రరాజు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ జె.సౌమ్యాజాస్పిన్, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జె.రామారావు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

సాలూరు: వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరుతూ పట్టణ పోలీసులు గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుంచి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు వరకు ర్యాలీ నిర్వహించారు. మెజిస్ట్రేట్ కె.రమేష్ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునని చెప్పారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని కోరారు. టౌన్ సిఐ వాసునాయుడు మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ ధరించకపోతే అపరాధ రుసుం వసూలుతోపాటు లైసెన్స్ రద్దుకు సిఫారసు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు తాడ్డి తిరుపతి రావు, సీనియర్ న్యాయవాదులు టి.మురళీకృష్ణ, శ్రీనివాసరావు, కోట లక్ష్మణరావు పాల్గొన్నారు.

కురుపాం : కురుపాం కోర్టు నుండి బస్టాండ్ వరకు విద్యార్థులు, పారా వాలంటీర్లు, సామాజిక కార్యకర్తలతో హెల్మెట్ ధరించడంపై భారీ ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ వినియోగం ద్వారా ప్రాణానికి రక్షణ కలుగుతుందని న్యాయవాది బరాటం చంద్రమౌళి అన్నారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది శ్రీనివాస్, పారాలీగల్ వాలంటీర్లు అంధవరపు కోటేశ్వరరావు, గోటారి వెంకటరావు, షేక్ గౌస్ పాల్గొన్నారు.

పట్టణ సమస్యలపై దృష్టిసారించండి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలోని సమస్యలపై దృష్టి సారించాలని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సంస్థ సభ్యులు వలిరెడ్డి జగదీష్, గేదెల సర్వేశ్వరరావు.. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావును కోరారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు వినతి అందించారు. కాలువల పరిస్థితి సక్రమంగా లేదని, దోమల సమస్య ఎక్కువగా ఉందని వివరించారు. కుళాయిల ద్వారా రంగుమారిన నీరు వస్తోందని విన్నవించారు. వీధి దీపాలు పూర్తిస్థాయిలో లేవని తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని విజ్ఞప్తిచేశారు. కమిషనర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.



బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యిని చూపిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

వంతెనకు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-కొమరాడ

బ్రిటిష్ కాలిక్యులేటర్ వంతెనకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని సిపిఎం జిల్లా నాయకులు కొల్లి సాంబమూర్తి అధికారులను డిమాండ్ చేశారు. గురువారం జంఝావతి నదిపై ఉన్న కోటిపాం బస్సు వంతెనను ఆయన పరిశీలించారు. బ్రిడ్జిపై ఉన్న పెద్ద గొయ్యితోపాటు చిన్న గోతులకు మరమ్మతులు చేపట్టి, వాహనదారుల ప్రాణాలకు భరోసా కల్పించాలని కోరారు. బ్రిడ్జిపై పరిమితికి మించి బరువులతో వాహనాలు వెళ్తున్నా హెచ్చరికలు చేయకపోవడంతో బ్రిడ్జి ఇంకా శిథిలావస్థకు చేరుకునే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రెడ్డి శివున్నాయుడు పాల్గొన్నారు.

ఇంటింటా ఎల్‌సిడిసి సర్వే

ప్రజాశక్తి-వీరఘట్టం

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం మండలంలో గురువారం ఇంటింటి సర్వే ముమ్మరంగా సాగిందని వీరఘట్టం, బిటివాడ వైద్యాధికారులు పి.ఉమామహేశ్వరి, మానస తెలిపారు. ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎల్‌సిడిసి సర్వే చేస్తున్నట్లు తెలిపారు.